

ఎల్లుండి నుంచి మెదక్ రైలు సర్వీస్ రద్దు

ఈ నెల 21 వరకు నిలిచిపోనున్న సేవలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9: రైల్వే లైన్ పనుల కారణంగా గుంటూరు-కాచిగూడ-మెదక్ రైలును తాత్కాలికంగా రద్దు చేశారు. గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఉదయం వచ్చే రైలు సర్వీసును రద్దు చేసినట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు ప్రకటించారు. రాత్రి వచ్చే కాచిగూడ-మెదక్ సర్వీసు యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులందరూ ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



మెదక్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9: ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలు మూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలను అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 125 దరఖాస్తులు రాగా.. ఇందులో అధికంగా రుణమాఫీ 40, ధరణి 30, పెన్షన్ 4, డబుల్‌బెడ్‌రూంల కోసం 4, ఇతర సమస్యలపై 43 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ హెచ్చరించారు. అర్జీలను అందించిన వారు మరోసారి రావాల్సిన అవసరం రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ఎల్లయ్య, శ్రీనివాసరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో 96 అర్జీలు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9: సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 96 పిర్యాదులు అందాయని డీఆర్వో పద్మజ తెలిపారు. వీటిలో ధరణి, రేషన్ కార్డులు, ఇతరాత్ర వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా డీఆర్వో పద్మజ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు అధికంగా వస్తున్న క్రమంలో మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను, రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆమె కోరారు. సీపీవో బాలశౌరి, కలెక్టరేట్ ఏవో పరమేశం తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- ముంపు కాలనీల ప్రజలు అధైర్యపడవద్దు
- ఎర్రకుంట, చంద్రయ్యకుంట తూములను వెడల్పు చేస్తాం
- వరద నీరు నిల్వకుండా చర్యలు
- మంత్రి దామోదర, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- సంగారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



సంగారెడ్డిలోని ఎర్రకుంట తూమును మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, సెప్టెంబరు 9: సంగారెడ్డిలోని వరద ప్రభావిత కాలనీల్లో మరోసారి ఈ పరిస్థితి తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. వరద ముంపునకు గురైన సంగారెడ్డిలోని శ్రీచక్రకాలనీ, రెవెన్యూకాలనీ, ఎర్రకుంట, చంద్రయ్యకుంట, రామచంద్రకాలనీల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. మోకాళ్ల లోతు వరద నీటిలోనే ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగ్గారెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సి చర్యల గురించి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. ఎర్రకుంట, చంద్రయ్య కుంట తూముల్లో పూడిక తీయడంతోపాటు వెడల్పు చేయడం వల్ల వరద ముప్పును అధిగమించవచ్చని అధికారులు పేర్కొన్నారు. పలు కాలనీల ప్రజలు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. దీంతో, జగ్గారెడ్డితో కలిసి మంత్రి దామోదర్ ఎర్రకుంట కట్ట పైకెక్కి పరిశీలించారు. ప్రజలకు అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. వరద ముంపు నుంచి తప్పించడానికి అవసరమైన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.



వరద నీటిలోనే రెవెన్యూ కాలనీలో పర్యటిస్తున్న మంత్రి దామోదర, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కుంట కబ్జా..

కొన్నవారికి తంటా!

- కుంచించుకుపోయిన ఎర్రకుంట
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్ల విక్రయం
- తూము, కట్ట ధ్వంసం చేసిన వైనం
- వర్షాలకు బయటపడిన నిర్వాకం
- నీట మునిగిన కాలనీలు, ఇళ్లు
- లబోదిబోమంటున్న ప్రజలు



సంగారెడ్డిలో ఇళ్లలోకి చేరిన ఎర్రకుంట నీరు

'హైడ్రా' దృష్టిపెట్టాలి



చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' సంగారెడ్డి జిల్లాపైనా దృష్టి సారించాలి. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినవారికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి.

-శ్రీధర్ మహేంద్ర,
ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 9 : రియల్టర్ల మాయాజాలం అమాయకులకు శాపంగా మారిన పరిస్థితి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నెలకొన్నది. పట్టణంలోని రాజంపేట డ్రైవర్స్ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 376లో 11.32 ఎకరాల విస్తీర్ణంలో ఎర్రకుంట విస్తరించి ఉంది. కొంతమంది రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలోని వచ్చే 374, 375, 378 సర్వే నంబర్లలో భూమిని ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించారు. ఇందు కోసం కుంట కట్టని, తూమును ధ్వంసం చేసి నీరు నిల్వకుండా చేశారనే ఆరోపణలున్నాయి.



కుంట పరిధిలో వెలసిన నిర్మాణాలు

వర్షాలతో వెలుగుచూసిన ఆక్రమణలు

వారం రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఎర్రకుంట కబ్జాకు గురైన విషయం వెలుగు చూసింది. కుంటలో వర్షపు నీరు భారీగా చేరడంతో ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన కాలనీలు నీట మునిగాయి. ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. చెరువును ఆక్రమించుకుని ప్లాట్లుగా మార్చి అమ్మడంతోనే ముంపు సమస్య ఎదురైందని గుర్తించారు. ఇళ్లలోకి నీరు చేరడంతో ఉండలేక కొందరు ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్లాట్లను విక్రయించినవారు మాత్రం కిక్కురుమనలేదు.

శాపంగా మారిన అధికారుల నిర్లక్ష్యం

అధికారుల అండదండలతోనే చెరువును కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులు, కుంటలను పరిరక్షించాల్సిన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారుల నిర్లక్ష్యం రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారిందని మండిపడుతున్నారు. అన్ని అనుమతులు ఉన్నాయని ప్లాట్లు కొనుగోలు చేసిన తాము శిక్ష అనుభవిస్తున్నామని వాపోతున్నారు.

వాగును కబ్జా చేసి..

హైవేను ముంచేశారు

- సదాశివపేటలో ఓ వెంచర్ నిర్వాకం
- 65వ నంబర్ జాతీయ రహదారిపైకి వరద
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- హైడ్రా చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

7లో



65వ జాతీయ రహదారిపైకి వరద నీరు రావడంతో నిలిచిపోయిన వాహనాలు



సంగారెడ్డి జీజీహెచ్ గేటు వద్ద గుమిగూడిన రోగులు, వారి బంధువులు

జీజీహెచ్‌లో ఓపీ @ 2,150

- ఒక్క రోజులో రికార్డు స్థాయిలో నమోదు
- సీజనల్ వ్యాధులు, వరుస సెలవుల ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో ఓపీ నమోదైంది. సోమవారం ఒక్క రోజే 2,150 మంది రోగులు ఔట్‌పేషెంట్ సేవలు పొందారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు, వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులు, వరుస సెలవులతో ఓపీ సంఖ్య అమాంతం పెరిగింది. అంతేకాకుండా ఇక్కడ సకాలంలో నాణ్యమైన వైద్య సేవలందడం కూడా రోగుల రద్దీకి ఒక కారణంగా చెప్పవచ్చు. అత్యధికంగా 572 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, చిన్నపిల్లల విభాగంలో 351 ఓపీ నమోదైంది.

'ఆభా'లోనూ నంబర్ వన్

ఓపీ చిటీ కోసం రోగులు వరుసలో నిలబడాల్సిన పని లేకుండా నాలుగు నెలల క్రితం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆభా (ఏబీహెచ్‌ఏ-ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్, టోకెన్ సిస్టమ్ ద్వారా మొబైల్ ఓపీ రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని జీజీహెచ్ అధికారులు రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఓపీ కోసం గంటల తరబడి వరుసలో నిలబడే అవసరం లేకుండా నేరుగా 'ఆభా' యాప్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుని తక్షణం టోకెన్ ఇస్తున్నారు. 'ఆభా' ఓపీ రిజిస్ట్రేషన్‌లోనూ రాష్ట్రంలోనే సంగారెడ్డి జీజీహెచ్ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనీల్‌కుమార్ తెలిపారు.



ఓపీ కౌంటర్ వద్ద రోగుల రద్దీ

డెంగీతో శిశువు మృతి

హత్నూర, సెప్టెంబరు 9: డెంగీతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన శిశువు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందిన సంఘటన ఆదివారం సంగారెడ్డిలో చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం కుమారుడు దశ్విక్ (45 రోజులు) మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా.. సంగారెడ్డిలోని మాతా శిశు సంరక్షణ(ఎంసీహెచ్) ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం శిశువు మృతి చెందాడు. వైద్యులు సరైన సమయంలో చికిత్స చేయకపోవడంతోనే చిన్నారి మృతి చెందాడని తండ్రి ప్రభులింగం తెలిపారు. ఇదిలా ఉండగా, వారం రోజుల క్రితం అదే గ్రామంలో పత్తి అంజమ్మ(55) డెంగీతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వైద్య అధికారులు స్పందించి గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించి, వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరారు.



దశ్విక్ (ఫైల్)

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- గణేశ్ మండపాల నిర్వాహకులదే పూర్తి బాధ్యత
- పోలీసుల సూచనలు పాటించాలి
- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9: గణేశ్ నవరాత్రి ఉత్సాహలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మండపాల నిర్వాహకులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం గణేశ్ మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను సమష్టిగా జరుపుకోవాలన్నారు. అన్ని మతాల వారు కలిసి పండుగలు జరుపుకునే గొప్ప సంప్రదాయన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. గణేశ్ విగ్రహ ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు మండపాల నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. నిమజ్జం పూర్తయ్యే వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఏదైనా సమస్య వస్తే సంబంధిత స్టేషన్, డయల్ 100, జిల్లా పోలీసు కంట్రోల్ రూం 8712657888కు సమాచారం అందించాలని సూచించారు. ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలిగించరాదని పేర్కొన్నారు. మండపాల వద్ద 24 గంటల పాటు ముగ్గురు వలంటీర్లు కాపలా ఉండాలని స్పష్టం చేశారు. వినాయక విగ్రహాల కమిటీ సభ్యుల పేర్లు, అడ్రస్, ఫోన్ నెంబర్ స్టేషన్‌లో ఇవ్వాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్‌స్పీకర్లను వాడాలని స్పష్టం చేశారు. డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అనుకుని.. చావబాదారు..!

- మతిస్థిమితం లేని వ్యక్తిపై యువకుల దాడి
- దెబ్బలకు తాళలేక మృతి
- మెదక్ జిల్లా గోమారంలో ఘటన
- ఇద్దరు నిందితుల అరెస్ట్

7లో



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు



ఇస్లాంపూర్ వద్ద రోడ్డు పక్కన దిగబడిన స్కూల్‌బస్సు

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

25 మంది విద్యార్థులు సుక్షితం

తూప్రాన్, సెప్టెంబరు 9: విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేటు స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న చిన్నారులు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు 25 మంది విద్యార్థులతో మాసాయిపేట స్టేషన్ నుంచి దాతర్‌పల్లి వైపు వెళ్తున్నది. ఇస్లాంపూర్ వద్దకు రాగానే స్కూల్ బస్సు అదుపుతప్పి కుడివైపున రోడ్డు పక్కకు దూసుకుపోయింది. రోడ్డు పక్కన ఓ ఫాంహౌస్ ప్రహరీని తాకి నిలిచిపోయింది. ఈ ఘటనలో బస్సులోని చిన్నారులు ఎవరికీ గాయాలు కాలేదు. విద్యార్థులు ప్రమాదం నుంచి బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సును తాళ్ల సహాయంతో బయటకు లాగారు.

బడి పిల్లల చూపు భద్రం

పాఠశాలల్లో **'ఐ స్క్రీనింగ్'**

- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు
- దృష్టి సమస్య ఉన్నవారి గుర్తింపు
- త్వరలో కళ్లద్దాల పంపిణీ
- అంధత్వ నివారణకు ప్రభుత్వం ముందడుగు

7లో



సంగారెడ్డిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం

సింగూరు ప్రాజెక్టు గేట్లు మూసివేత

- ప్రాజెక్టుకు తగ్గిన వరద
- ఇన్‌ఫ్లో 13,335 క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 3,243 క్యూసెక్కులు
- 28.885 టీఎంసీలు నిల్వ
- విద్యుత్ ఉత్పత్తి కొనసాగింపు

7లో



మూసివేసిన సింగూరు ప్రాజెక్టు గేట్లు

డయాలిసిస్ కేంద్రాన్ని సందర్శించిన నిమ్స్ వైద్యులు


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 9 : మెదక్ జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని నెఫ్రాలజీ నిమ్స్ వైద్య బృందం సోమవారం సందర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ సేవలు, పర్యవేక్షణ బాధ్యత నిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే అపెక్స్ సంస్థకు అప్పజెప్పారు. అందులో భాగంగా నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ భూషణ్‌రాజ్ ఆధ్వర్యంలో డయాలసిస్ రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో 69 మంది కిడ్నీ బాధితులు సేవలు పొందుతున్నారన్నారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్రాన్ని సందర్శించి రోగులను పరీక్షించి తగు సూచనలు చేశామన్నారు. నెలకోసారి ఈ బృందం ఇక్కడకు వచ్చి పరీక్షిస్తుందని అన్నారు. రోజు వారీగా ఇప్పటికే టెలీకాన్ఫరెన్స్ ద్వారా సేవలందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర ఇన్‌చార్జి అంతోల్ల సురేష్, ఇన్‌చార్జి నవీద్, ప్రశాంత్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎండీఏ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, భూ-సర్వే నీటిపారుదల శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి సోమవారం అధికారులు వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఏడీ సర్వేలాండ్ వినయ్ కుమార్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. -సిద్దిపేట కలెక్టరేట్

దేశ హితం కోసం పని చేసే పార్టీ బీజేపీ మాత్రమే

● రాష్ట్రంలో గాడి తప్పిన రేవంత్‌రెడ్డి పాలన
● మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 9 : దేశ హితం కోసం పనిచేసే పార్టీ బీజేపీ మాత్రమే అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త స్థాయి నుంచి నాయకుడి స్థాయికి ఎదగడం బీజేపీ పార్టీలో మాత్రమే సాధ్యమన్నారు. ఇతర పార్టీల తరహాలో బీజేపీలోనూ కుటుంబ రాజకీయాలు ఉండవన్నారు. ఇటీవల బీజేపీ సభ్యత్వంలోకి చాలా మంది న్యాయవాదులు వస్తున్నారని, ఇది మారుతున్న దేశ రాజకీయాలకు సంకేతం అన్నారు. సిద్దిపేట గడ్డ నుంచే మార్పు మొదలైందని, కొంతమంది నాయకులకు మొన్నటి ఎన్నికలు కనువిప్పు కలిగించాయన్నారు. మోదీ ప్రభుత్వంలో విద్యా రంగంలో సమూల మార్పులు తెస్తుందన్నారు. ఈ దేశ అవసరాల కోసం నూతన చట్టాలను తెచ్చామన్నారు. దేశ సంస్కృతిని కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు తుంగలో తొక్కాయన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ప్రతీ రంగాన్ని ప్రక్షాళన చేశారని తెలిపారు. ఎప్పుడు ఎవరు జైలుకి వెళతారో తెలియని పార్టీతో మాకు పొత్తు ఉండదన్నారు. రేవంత్ రెడ్డి పాలనా గాడి తప్పుతుందన్నారు. వినాయక చవితి వేడుకలు ప్రారంభమైతే కానిస్టేబుల్‌ను కూడా ట్రాన్స్‌ఫర్ చేయరు, కానీ సీపీలను మారుస్తున్నారని విమర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ తదితరులు ఉన్నారు.


చెల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ

హైడ్రాలో నష్టపోయిన పేదలకు కోకాపేటలో ఇళ్లు కట్టించాలి

దుబ్బాక, సెప్టెంబరు9 : హైడ్రా ద్వారా నష్టపోయిన నిరుపేద బాధిత కుటుంబాలకు కోకాపేటలో 150 గజాల స్థలాన్ని కేటాయించి, ఇళ్లను కట్టించాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక మున్సిపాలిటీ చెల్లాపూర్ వార్డులోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ హైడ్రా నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అన్ని జిల్లాల్లో అమలు చేస్తే, స్వాగతిస్తామన్నారు. 2వవార్డు కౌన్సిలర్ దేవలక్ష్మి తండ్రి వారంరోజుల క్రితం మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ కౌన్సిలర్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ‘క్రిప్టో’ దందా

కాయిన్స్ పేరుతో వసూళ్లు?

శివ్వంపేట, సెప్టెంబర్ 9 : క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే డబ్బు రెట్టింపు అవుతుందని గ్రామాల్లోని అమాయకులకు వల వేస్తున్నారు. శివ్వంపేట మండల పరిధిలో ఇద్దరు యువకులు ఏజెంట్లుగా మారి అమాయక రైతులకు రెట్టింపు డబ్బు ఆశచూపి పెట్టుబడి పెట్టిస్తున్నారని తెలిసింది. 50 వేలు పెట్టుబడులు పెడితే డబ్బు మూడింతలు అవుతుందని, కరెన్సీ కాయిన్స్ వస్తాయని నమ్మబలుకుతున్నట్లు సమాచారం.నాలుగు, ఐదు గ్రామాల్లో రైతులతో పాటు ఇతరులు సుమారు రూ.కోటికిపైగా క్రిప్టో కరెన్సీలో ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడులు పెట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఏజెంట్లుగా ఉన్న యువకులు ఇటీవల కొంతమందిని గోవా విహారయాత్రకు తీసుకెళ్లినట్లు సమాచారం.



ప్రమాదకరంగా నాయిని చెరువు

మండల కేంద్రమైన చౌటకూర్ శివారులోని నాయిని చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు జలకళను సంతరించుకోగా చెరువు కట్ట ప్రమాదకరంగా మారింది. చెరువు కట్ట నాసిరకంగా ఉండడంతో ఎప్పుడు గండిపడుతుందోనని రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎక్సకవేటర్‌తో నాసిరకంగా మారిన ఆనకట్టపై మట్టి పోస్తూ మరమ్మతులు చేపడుతున్నారు. అయితే, పొలాలకు వెళ్లేందుకు స్థానిక రైతులు చెరువు అలుగుపై నుంచి మట్టి, కంకర పోసి దారిని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అలుగు ఎత్తు పెరిగింది. నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో కట్ట మరింత ప్రమాపుటంచుల్లోకి చేరింది.

- పుల్‌కల్

వక్ఫ్ భూబాధిత రైతులను ఆదుకోవాలి

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి
● రైతు హక్కుల సాధన సమితి జహీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి

జహీరాబాద్, సెప్టెంబరు 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వక్ఫ్ భూబాధిత రైతులను ఆదుకోవాలని రైతుహక్కుల సాధన సమితి జహీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 19 వేల పైచిలుకు ఎకరాల రైతుల వ్యవసాయ భూమిని వక్ఫ్‌భూమి అంటూ ప్రభుత్వాలు గుర్తించడమేంటని ఆయన ప్రశ్నించారు. తాతల, ముత్తాతల కాలం నుంచి ఈ భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు వక్ఫ్ భూములంటూ చెప్పడంతో నివ్వెరపోతున్నారన్నారు. 2018 వరకు రైతుల పేరిట ఉన్న భూములున్నాయని, సాగులో సైతం ఉన్నారన్నారు. గతపాలకుల హయాంలో భూప్రక్షాళన పేరుతో రైతుల భూములను వక్ఫ్‌భూములుగా గుర్తించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ భూములు రైతులవా లేక వక్ఫ్‌కు చెందినవా.. సందిగ్దంలో పెట్టి రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆయా భూములకు రైతుల పేరు స్థానంలో వక్ఫ్ అని వస్తుందన్నారు. 2018 నుంచి ఈ భూములకు రైతుబంధు రావడంలేదని, రుణమాఫీ వర్తించడం లేదని, కొత్తగా రుణం తీసుకుందామంటే అవకాశం లేకుండా పోయిందని ఆయన వాపోయారు. రైతులకు న్యాయం జరిగే వరకు రైతుహక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుతో బాధిత రైతులకు న్యాయం జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కేంద్ర జాయింట్ పార్లర్ కమిటీ సభ్యురాలుగా ఉండడంతో తమకు న్యాయం జరుగుతుందని ధీమాను వ్యక్తం చేశారు. ఈనెల 11న ఎంపీ డీకే అరుణ జహీరాబాద్ పట్టణానికి వస్తున్నారన్నారు. వక్ఫ్ భూబాధిత రైతులందరూ తరలిరావాలని వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఈ సమావేశంలో రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, అన్వీరప్ప, బస్వరాజ్, జగన్నాథ్‌రెడ్డి, వీరారెడ్డి, ఖుర్షీద్‌మియా, మాణయ్య, రవీందర్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.


వక్ఫ్ బోర్డు రిలీజ్ చేసిన గెజిట్‌ను చూపుతున్న రైతు హక్కుల సాధన సమితి నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి

ఐ స్క్రీనింగ్

ప్రభుత్వ బడుల విద్యార్థులకు పరీక్షలు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు సరైన పోషక ఆహారం లభించక అనేకమంది నేత్ర సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారికి బాసటగా నిలవాలన్న ఉద్దేశంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తుగా బడి పిల్లల్లో దృష్టి లోపాలను గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు, శస్త్రచికిత్సలు చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నది. అందుకోసం కొన్నిరోజులుగా స్కూల్ ఐ స్క్రీనింగ్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నది. వైద్య బృందాలు పాఠశాలల వద్దకే వెళ్లి విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నాయి.

- పాఠశాలలకు వెళ్తున్న ఆర్‌బీఎస్‌కే బృందాలు
- దృష్టి లోపం ఉన్నవారికి త్వరలో కళ్లద్దాల పంపిణీ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 : ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు కంటి పరీక్షలు చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం) ద్వారా వైద్య బృందాలను రంగంలోకి దింపింది. గత నెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబరు నెలాఖరు వరకు కొనసాగనున్నది. జిల్లావ్యాప్తంగా కంటి పరీక్షల స్క్రీనింగ్ చురుకుగా సాగుతున్నది.

పాఠశాలలకే వెళ్లి..

ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది ఆర్‌బీఎస్‌కే బృందాలతో పాటు 12 మంది ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఇందులో పాల్గొంటున్నారు. జిల్లాలో సుమారు 61 వేల మంది విద్యార్థులుండగా, ఇప్పటివరకు 23,747 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అందులో బాలురు 12129 మంది ఉండగా, బాలికలు 11618 మంది ఉన్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం పాఠశాలలకే వెళ్లి పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ఒక్కో బృందం రోజుకు 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నది..


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం

బయటపడుతున్న కంటి సమస్యలు

అనేక మంది విద్యార్థుల్లో కంటి సమస్యలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 23,747 మంది పిల్లలకు కంటి పరీక్షలు జరపగా, 1055 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అందులో బాలురు 420, బాలికలు 635 మంది ఉన్నారు. వీరిలో దృష్టి లోపాలను సరిచేయడానికి త్వరలో కళ్లద్దాలను ఉచితంగా అందజేయనున్నారు.

విద్యార్థుల దృష్టి లోపాల నివారణకే..



పిల్లల్లో పౌష్టికాహారం లేమి, అతిగా ఫోన్లు వాడకం వల్లే దృష్టి లోపాలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లాలో మూడు నెలల పాటు బడి పిల్లలకు కంటి పరీక్షలు చేయాలనే ఆదేశాలు వచ్చాయి. అందుకనుగుణంగా జిల్లావ్యాప్తంగా స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. విద్యార్థుల దృష్టి లోపాల నివారణకే వైద్య, ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది.

-డా.శశాంక్‌దేశ్‌పాండే, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి


పోచయ్య(ఫైల్)

హవేళీఘణపూర్, సెప్టెంబరు 9 : విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం రాజిపేట గ్రామానికి చెందిన దాసరి పోచయ్య(65) పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం విధుల్లో భాగంగా స్థానిక గణేష్ మండపం వద్ద ఊడుస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే కిందపడి ఉన్న మండపానికి తీసిన కరెంట్ వైరు అతని కాళ్లకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కోడలు మౌనిక ఫిర్యాదుతో కేసు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

నీటి గుంతలో పడి వ్యక్తి..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 6 : ఓ వ్యక్తి నీటి గుంతలో పడి మృతి చెందినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ప్రకాష్ (28) అనే వ్యక్తి పోతిరెడ్డిపల్లిలో గణపతి విగ్రహాలు తయారు చేస్తూ జీవించేవాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటికెళ్లిన అతను తిరిగిరాలేదు. సోమవారం ఉదయం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శిల్పా వెంచర్ ఎదుటగల కాలనీలో ఓ నీటి గుంతలో మృతి చెంది కనిపించాడు. ప్రకాష్ మృతికి గల కారణాలు తెలియరాలేదని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరు దుర్మరణం

పాపన్నపేట, సెప్టెంబరు 9: కారు, బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పాపన్న పేట మండల పరిధిలోని ఎల్లాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హవేలీ ఘనపూర్ మండలం చౌట్లపల్లి గ్రామానికి చీమల గణేష్(28) ప్రైవేటు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం లక్ష్మీనగర్ ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ఏడుపాయల కమాన్ వైపు నుంచి మెదక్ వెళుతున్న కారు ఎల్లాపూర్ శివారులో ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో కిందపడిన గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి ..

ధూళిమిట్ట, సెప్టెంబరు 9: మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని హనుమతండా గ్రామానికి చెందిన బానోత్ కిషన్ మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో ఇంట్లో చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. ఆదివారం కుడా బానోత్ కిషన్ మద్యం తాగి రావడంతో ఇంట్లో చిన్న గొడవ జరిగింది. మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జనగామ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఏజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మద్దూర్ ఎస్సై మహబూబ్ ఓ ప్రకటనలో తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెజ్జంకి, సెప్టెంబరు 9: మండలంలోని తలారివానిపల్లి గ్రామ శివారులో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగు పడి ఎద్దు మృతి



అక్కన్నపేట, సెప్టెంబరు 9: అక్కన్నపేట మండలం గొల్లపల్లిలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి గుడాల మల్లయ్య అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. రైతు మల్లయ్యను ప్రభుత్వం ఆదుకోవాని మాజీ సర్పంచ్ గుడాల సంపత్ యాదవ్ కోరారు.

దొంగేమో అనుకుని.. చావబాదారు..!

- గుర్తుతెలియని వ్యక్తి మృతి.. ఇద్దరి అరెస్టు


హత్య కేసు నిందితులు

తూప్రాన్, సెప్టెంబరు 9: ఊర్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తిని దొంగగా అనుమానించారు. అతడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడు మృతిచెందగా, అందుకు కారణమైన ఇద్దరిని గుర్తించి పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ సర్కిల్ పరిధి శివ్వంపేట మండలం గోమారంలో చోటు చేసుకున్నది. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో పదిహేను రోజులుగా మతిస్థిమితంలేని ఒకరు ఊర్లో భిక్షాటన చేసుకుంటు జీవిస్తున్నాడు. ఈనెల 4న రాత్రి గ్రామానికి చెందిన గంగిరెడ్డి తిరుపతిరెడ్డి(26), పందిముక్కల మణికంఠగౌడ్(28) మతిస్థిమితం లేని వ్యక్తిని చోరికి వచ్చినట్లు అనుమానించి దాడి చేసి గాయపర్చారు. ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి చితక బాదారు. దాడితో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. తూప్రాన్ సీఐ రంగకృష్ణ ఆధ్వర్యంలో శివ్వంపేట ఎస్‌ఐ మహేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఇద్దరి దాడిలో హత్యకుగురైనట్లు గుర్తించినట్లు వివరించారు. సోమవారం నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


బడా గణేష్ చెంత నీలం మధు

ఖైరతాబాద్‌లోని వినాయకుడిని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు తొలగి ప్రజలు సంతోషంగా ఉండాలని ఈ సందర్భంగా గణనాథుడి కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

-సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9

ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి ఆర్థిక సాయం

- మినాజీపేటలో రెండు కుటుంబాలకు రూ.లక్ష అందజేత



వర్గల్, సెప్టెంబరు 9 : మండల పరిధిలోని మినాజీపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన రెండు కటుటుంబాలకు ప్రముఖ జ్యోతిష్యుడు పరంకుశం వేణుస్వామి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. విద్యుదాఘాతం తో మృంతి చెందిన నీల యాదగిరి కుటుంబ సభ్యులకు రూ. 50వేలు, అనారోగ్యంతో మృతి చెందిన కర్రె కృష్ణ కుటుంబ సభ్యులకు రూ. 50 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎంతో కొంత సాయం చేయడం బాధ్యతగా బావిస్తామన్నారు. ఆర్థిక సాయం చేసినందుకు వేణు స్వామికి మినాజీపేట మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత


కుటుంబ సభ్యులకు చిన్నారిని అప్పగిస్తున్న పోలీసులు

చేర్యాల, సెప్టెంబరు 9 : ఓ నాలుగేళ్ల చిన్నారి తప్పిపోగా, పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన సోమవారం చేర్యాల పట్టణంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన చెవిటి రాజు భార్య స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ప్రసవించింది. తన నాలుగేళ్ల కూతురు నిత్య శ్రీ ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటూ తప్పిపోయింది. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే సమీప వీధిలో చిన్నారి తప్పిపోయి రోదిస్తున్న విషయాన్ని స్థానికులు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయమై తండ్రి పోలీసులకు సమాచారం అందించడంతో సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పాపను జాడను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

డివైడర్ మధ్యలో నిలిచిన భారీ వాహనం

- రాజీవ్ రహదారి ఇరువైపులా స్తంభించిన ట్రాఫిక్



కొండపాక, సెప్టెంబరు 9 : భారీ వాహనం దుద్దెడ శివారులో యూటర్న్ తీసుకుంటుండగా డివైడర్ మధ్యలో నిలిచిపోయింది. దాంతో రాజీవ్ రహదారిపై ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న భారీ లారీ బందారం వెళ్లేందుకు దుద్దెడ దాటిన తర్వాత యూటర్న్ తీసుకుంటుండగా డివైడర్ పైకి వెళ్లి టైర్లు ఇరుక్కుపోయి నిలిచిపోయింది. రెండు వైపులా రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిచిపోవడంతో రాజీవ్ రహదారిపై వెళ్తున్న వాహనాలు ఎక్కడికక్కడే రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. టోల్ ప్లాజా వారికి సమాచారం ఇవ్వడంతో కంటైనర్ తెచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించారు.

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

- ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి


వాహనాల తనఖీల్లో పట్టుకున్న అక్రమ మద్యం

జహీరాబాద్, సెప్టెంబరు 9 : గోవా నుంచి హైదరాబాద్‌కు టూరిస్టు బస్సుల్లో అక్రమంగా తీసుకువస్తున్న 7లీటర్ల పైచిలుకు గోవా మద్యం పట్టుకున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం చిరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీలు చేపడుతుండగా గోవా మద్యం తరలిస్తూ కొంతమంది పట్టుబడ్డారన్నారు. ఈ తనిఖీల్లో చెక్‌పోస్టు సీఐ లక్ష్మణ్‌సింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ప్రాజెక్టు గేట్లు మూసివేత

- వరద తగ్గుముఖం
- జల విద్యుత్ ఉత్పత్తి కొనసాగింపు
- ఇన్ ఫ్లో 13,335 క్యూసెక్కులు.. అవుట్ ఫ్లో 3,243 క్యూసెక్కులు
- 29.917 టీఎంసీలకు 28.885 టీఎంసీలు నిల్వ

పుల్‌కల్, సెప్టెంబరు 9: సింగూరు ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పడుతున్నది. గడిచిన వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద నీటి ప్రవాహం పోటెత్తడంతో గరిష్ట నీటి మట్టానికి చేరుకున్నది. దీంతో ఈ నెల 5వ తేదీన రెండు గేట్లను ఎత్తి వరద జలాలను ఐదు రోజుల పాటు దిగువకు విడుదల చేశారు. ఎగువ నుంచి క్రమంగా నీటి ప్రవాహం తగ్గుతుండటంతో ఒక్కో గేటును మూసేస్తూ వచ్చారు. అయితే, సోమవారం ఉదయం నాటికి వరద నీటి ప్రవాహం మరింతగా తగ్గడంతో ఎత్తి ఉన్న మరో గేటును కూడా మూసివేసినట్లు ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 13,335 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 3,243 క్యూసెక్కులుగా నమోదైంది. ఇందులో జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,842 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కాగా, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. అయితే, ప్రస్తుతం 523.420 మీటర్లకు 28.885 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.


జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని టర్బయిన్లు

1.5 మిలియన్ యూనిట్లు జల విద్యుత్

ఈ నెల 5 నుంచి సోమవారం వరకు 1.5 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి అయిందని జెన్‌కో ఏడీఈ పాండయ్య తెలిపారు. 7.5 జల విద్యుత్ సామర్థ్యం గల రెండు టర్బయిన్లు చురుకుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్ సదాశివపేట, జోగిపేట ప్రాంతాల్లోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు సరఫరా జరుగుతుందన్నారు. ఇదిలావుండగా మంజీర రిజర్వాయర్ వద్ద రెండు గేట్లను మూసివేశారు. 2వ నంబరు గేటును మీటరు ఎత్తు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు మరువలేనివి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9: తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరవలేనివని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కాళోజీ 110వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణతో సన్మానింపబడిన కాళోజీ స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి నాగరాజుగౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత, సెక్రటరి సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో..

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 : సంగారెడ్డిలో తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో డీఆర్‌వో పద్మజ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారి ఐనేష్, కలెక్టరేట్ ఏవో పరమేశ్, అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, ఉపాధ్యక్షుడు మోహన్, మైనార్టీ కార్యదర్శి అజీమ్, సురేశ్, శేఖర్ పాల్గొన్నారు. అలాగే తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలు కొనియాడారు.


సంగారెడ్డి కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌వో పద్మజ

టీఎన్‌జీవో భవన్‌లో..

మెదక్ కల్చరల్, సెప్టెంబర్ 9: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, కవులు అంజన్న, ఇక్బాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 15 జీవాలు మృతి
- బాధితులకు మాజీ మంత్రి హరీ‌ష్‌రావు ఆర్థికసాయం

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 9: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 15 గొర్రెలు మృతి చెందగా 10 గొర్రెలకు తీవ్రగాయాలైన సంఘటన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల్లి ఎల్లయ్య, గుండెల్లి కొమురయ్యలు రోజు మాదిరిగానే గొర్రెలను సాముహిక గొర్రెల షెడ్లలో తోలి ఇంటికి వచ్చారు. ఉదయం వెళ్లి చూడగా గొర్రెల మందపై కుక్కలు దాడి చేసినట్లు గమనించారు. అప్పటికే 15 గొర్రెలు మృతి చెందగా గాయపడ్డవాటికి పశువైద్యాధికారి శ్రవణ్ కుమార్ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తక్షణ సహాయం కింద పంపించిన రూ.10 వేలను బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కుంభాల ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏల్లయ్య, మాజీ ప్రజాప్రతినిధులు పర్శ రాములు, ఆంజనేయులు, బాల్ రెడ్డి, భాను చందర్ బాధితులకు అందజేశారు.


మాజీ మంత్రి హరీష్‌రావు పంపించిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్న నేతలు

వాగును కబ్జా చేసి..
హైవేను ముంచేశారు

- 65వ నంబర్ జాతీయ రహదారిపైకి వరద
- గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం
- హైడ్రా చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్


నాగ్సాన్‌పల్లి శివారులో నల్లవాగును కబ్జాచేసి వాగును కుదించిన ఓ వెంచర్ యాజమాన్యం

సదాశివపేట, సెప్టెంబరు 9: వాగుతో పాటు వరద నీటి కాలువలను కబ్జా చేసి, ప్రవాహాన్ని దారి మళ్లించి ఏకంగా 65వ నంబర్ జాతీయ రహదారిని ముంచేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పెద్దాపూర్, నాగ్సాన్‌పల్లి గ్రామాల వద్ద ఓ ప్రముఖ వెంచర్ యాజమాన్యం వెంచర్‌లో నుంచి వెళ్తున్న నల్ల వాగును ఆక్రమించి వాగు వెడల్పును తగ్గించగా జాతీయ రహదారి పక్కనే కొత్తగా వెలసిన ఓ ప్రముఖ హోటల్ యాజమాన్యం హోటల్ మధ్య భాగం నుంచి వెళ్తున్న వాగు వరద నీటి కాలువలను కబ్జా చేసి దారి మళ్లించారు. ఈ రెండు వ్యాపార సంస్థల వ్యవహారంతో ఈ నెల 7వ తేదీన కురిసిన భారీ వర్షానికి జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. వాగును ఇష్టారీతిన కుదించడం, మలుపులు తిప్పడంతో భారీ వర్షాలతో వరద నీరు సజావుగా వెళ్లేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షం నీరంతా జాతీయ రహదారిపైకి చేరి ట్రాఫిక్ జామ్‌కు కారణమైంది. వరద తీవ్రతతో చిన్న వాహనాలు పూర్తిగా నీట మునిగిపోయి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. విషయం తెలుసుకున్న సదాశివపేట సీఐ మహేష్ గౌడ్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, నేషనల్ హైవే శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది హుటాహుటినా పెద్దపూర్‌కు వద్దకు చేరుకుని వరదలో చిక్కుకుపోయిన వాహనాలను ఎక్స్‌కవేటర్ల సహాయంతో పక్కకు లాగారు. జాతీయ రహదారిపై రాకపోకలు సజావుగా సాగేందుకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఓ ప్రముఖ హోటల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నల్లవాగు కాలువ కనిపించకుండా నిర్మించిన భారీ సిమెంట్ స్లాబ్‌లను, నల్ల వాగు కాలువలో అనాధికారికంగా ఏర్పాటు చేసిన సీసీ పైపులను, కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ కప్పులను పగలగొట్టి జాతీయ రహదారిపై వరద నీటి ప్రవాహాన్ని మళ్లించారు.

రైతులు, గ్రామస్థుల ఆగ్రహం

ఇంత జరిగినా... సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. వెంచర్ కోసం దాదాపు 30 మీటర్ల వెడల్పుతో ఉన్న నల్లవాగును ఏకంగా ఐదు మీటర్లకే పరిమితం చేసిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. హోటల్ నిర్వాహకులు నల్లవాగు కాలువను మూసివేయడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన చేయకుండానే ఉన్నతాధికారులు వెంచర్లు, విల్లాలు, హోటళ్ల నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



నల్లవాగు కాలువపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సీసీ స్లాబ్ తొలగింపు..

భాషాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యం


జహీరాబాద్: మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది


బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది


నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆర్డీవో, సిబ్బంది

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పద్య పఠనం, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కాళోజీ సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు.

జహీరాబాద్, సెప్టెంబరు 9: భాషాభివృద్ధి జరిగినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వేర్వేరు కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడుతూ 1968-69లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కాళోజీ నారాయణరావు చేసిన సేవలను వారు కొనియాడారు. కాళోజీ రాసిన కవితలు నేటికీ అందరికీ ఆదర్శంగా ఉన్నాయని వారు గుర్తుచేశారు. ఆయా కార్యక్రమాల్లో అధ్యాపకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● కోహీర్: మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాలశంకర్, ఎంపీడీవో భారతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాళోజీ నారాయణరావు రచనలు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

● జిన్నారం: బొల్లారం మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ మంగతాయారు, మేనేజర్ నిర్మల, ఆర్వో నర్సింహులు, ఇతర సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● కల్హేర్: కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని ఎంపీపీ, తహసీల్దార్ కార్యాలయాల్లో కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కల్హేర్‌లో తహసీల్దార్ శివశ్రీనివాస్, ఎంపీడీవో రమేష్‌బాబు, సిర్గాపూర్‌లో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో మల్సూర్ నాయక్, ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

● కంగ్టి: మండల కేంద్రంలోని లిటిల్‌స్టార్ పాఠశాలలో తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించి, ఉపాధ్యాయులను సన్మానించారు.

● నారాయణఖేడ్: ఖేడ్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖేడ్‌లోని గాయత్రి పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ సిద్దారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, కాళోజీ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. తెలుగు ఉపాధ్యాయులు విజయపాల్, నాగమణిని శాలువాలతో సన్మానించారు. కాగా ఖేడ్ శివారులోని జ్యోతిబాపూలే పాఠశాలలో కాళోజీ జయంతిని నిర్వహించారు.

● నర్సాపూర్: నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏవో సహదేవ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఎల్లంకి కళాశాలలో కాళోజీకి నివాళులర్పించారు.

● శివ్వంపేట: మండల పరిధిలోని దొంతి ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని ఇన్‌చార్జి హెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు పద్యాల పోటీలు, చిత్రలేఖనం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందచేశారు.

● చేగుంట: చేగుంట ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల నోడల్ అధికారి నీరజ, తెలుగు భాషా ఉపాధ్యాయులు ఎండీ గౌస్ మోహియుద్దీన్ మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ మన యాస భాషకు దిక్సూచిగా నిలిచాడ కొనియాడారు. చేగుంట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

● హవేళిఘణపూర్: మండలంలోని కూచన్‌పల్లి, హవేళిఘణపూర్ ఉన్నత పాఠశాల్లో కాళోజీ జయంతిని హెచ్ఎం మధుమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: తెలంగాణ ప్రజల ఆవేదనను ఆగ్రహాన్ని తన గేయాలతో చూపించిన ఘనత ప్రజాకవి కాళోజీకే దక్కుతుందని భాషా ఉపాధ్యాయుడు చంద్రకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. రాంపూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పద్య పఠన పోటీలు, ఒక నిమిషం తెలుగులో మాట్లాడడం, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య

పాపన్నపేట, సెప్టెంబరు 9: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీపీఎఫ్ పార్టీ ఫైనల్స్, లోన్లు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్‌ల బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ మెదక్ జిల్లా శాఖ అధ్యక్షుడు సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్ హీరాలాల్, కొత్తపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సురేందర్ గౌడ్, నాగసానిపల్లి ప్రధాన ఉపాధ్యాయులు రామ్ కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, నజీరుద్దీన్, మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలరాజు, రమేష్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలి


చిన్నశివనూర్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు

చేగుంట, సెప్టెంబరు 9: పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని వడియారం, మక్కరాజిపేట్, చందాయిపేట్, కరీంనగర్, చిన్న శివనూర్ పాఠశాలల్లో సోమవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయుల డీఏలతో పాటు వివిధ రకాల బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి వారల నర్సింహులు, ఎస్టీయూ మండల అధ్యక్షుడు మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య ,జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు .

నలుగురు వ్యవసాయ విస్తరణ అధికారుల బదిలీ

రామాయంపేట, సెప్టెంబరు9: మండలంలో నలుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు సోమవారం బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి చేరుకున్న అధికారులు విధుల్లో చేరారు. రామాయంపేట వ్యవసాయ విస్తరణ అధికారిగా ప్రవీణ్, అక్కన్నపేట అధికారిగా శ్రీనివాస్, కాట్రియాల అధికారిగా సందీప్, రాయిలాపూర్ విస్తరణ అధికారిగా సాయికృష్ణ బాధ్యతలు చేపట్టారని మండల వ్యవసాయ అధికారి రాజ నారాయణ తెలిపారు.

గవ్వపల్లిలో మద్యం షాపులో చోరీ


సీసీ పుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 9: మండలంలోని గవ్వపల్లి గ్రామ చౌరస్తాలో సోమవారం రాత్రి రేణకామాత మద్యం షాపులో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి మద్యం షాపు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఉదయం షెట్టర్ తాళాలు ధ్వంసమై కనిపించడంతో షాపులో పరిశీలించగా రూ. 50 వేలు, 24 మద్యం బాటిళ్లు, రెండు బీరు కాటన్లను చోరీకి గురైనట్టు గుర్తించారు. బాధితులు తిరుపతి, వినయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మెదక్ క్లూస్ టీంతో వివరాలను సేకరించారు. షాపులో ఉన్న సీసీ పుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.

పోలీసులు ప్రజలతో మమేకమై ఉండాలి: డీఎస్పీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిలప్‌చెడ్, సెప్టెంబరు 9: పోలీసులు ప్రజలతో మమేకమై ఉండాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనవెంట నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ యాదగిరి సిబ్బంది ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9: హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టల్స్, గురుకుల హాస్టల్స్ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పలు డిమాండ్లు చేశారు. హాస్టల్ విద్యార్థులపై ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, డివిజన్ నాయకులు సిద్దు, అనిల్, బన్నీ, సాత్విక, మల్లేశ్వరి, సౌజన్య, నవ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

కల్హేర్, సెప్టెంబరు 9: కల్హేర్ ఎంపీడీవోగా డి. రమేష్‌బాబు సోమవారం ఎంపీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లాలోని డీఆర్డీఏలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబును డిప్యూటేషన్‌పై కల్హేర్ ఎంపీడీవోగా నియమించారు.

● నాగల్‌గిద్ద: నాగల్‌గిద్ద ఎంపీడీవోగా కె.మహేశ్వర్‌రావు సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వర కు ఎంపీడీవో విధులు నిర్వహించిన రాజశేఖర్ బదిలీపై న్యాల్‌కల్ మండలానికి వెళ్లారు. ఆయన స్థానంలో మహేశ్వర్‌రావు బాధ్యతలు చేపట్టారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

కొండాపూర్, సెప్టెంబర్ 7:వర్షాలకు నీట మునిగి దెబ్బతిన పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మునిదేవునిపల్లిలో ఆయన నీట మునిగి నష్టపోయిన పంటలను పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు, కూరగాయలు నీట మునిగి రైతులకు తీవ్రనష్టం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం చెల్లించాలని, రబీ సీజన్‌లో సాగుకు ఉచితంగా ఎరువులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు బాబురావు, గోపాల్, నర్సింహులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడలు

మనోహరాబాద్, సెప్టెంబరు 9: స్థానిక జేఎంజే ప్రైవేట్ పాఠశాలలో ఈ నెల 12, 13 తేదీలలో మనోహరాబాద్ ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పీఈటీ మంజుల సోమవారం తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నారాయణఖేడ్, సెప్టెంబరు 9: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వినాయక విగ్రహాలను పట్టణ సమీపంలోని కమలాపూర్ చెరువులో నిమజ్జనాలు చేస్తారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ తరపున అవసరమైన ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, చెరువును సందర్శించారు.ఏర్పాట్లకు స్థలాన్ని పరిశీలించారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు


మునిపల్లి: తాటిపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు

మునిపల్లి, సెప్టెంబర్ 9: మండల పరిధిలోని తాటిపల్లి, పిల్లోడి, అంతారం గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా నీట మునిగి నష్టపోయిన పత్తి పంటను సోమవారం జోగిపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని ముందుగా తొలగించి కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను 3గ్రాముల నీటిలో కలిపి మొక్కల వేరు వ్యవస్థ తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్, సరిత, ఏడీఏ సత్యనారాయణ రైతులకు సూచించారు. పంట నష్టపోయిన రైతులెవరూ అధైర్యపడొద్దని, నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. వారి వెంట వ్యవసాయ శాఖ అధికారులు సారిక, శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవోలు, రైతులు తదితరులు ఉన్నారు.

● వట్‌పల్లి: మండలంలోని షాద్‌నగర్, వట్‌పల్లి శివారులో వర్షాలతో అధికంగా దెబ్బతిన్న పత్తి పంటలను సోమవారం ఏడీఏ సత్యనారాయణ, ఏవో శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త రాహుల్ పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలో ఉన్న నీటి నిల్వను తొలగించే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20కిలోల పొటాష్ ఎరువులను పత్తి పంటకు వేయాలని రైతులకు సూచించారు. వెంట ఏఈవో కళ్యాణ్, రైతులు ఉన్నారు.

● నారాయణఖేడ్: మండలపరిధిలోని జూక్కల్ శివార్లలోని వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్ కుమార్ కుమార్ సందర్శించి, రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తిపంటకు యూరియా, పొటాష్ ఎరువులను ఎంత మోతాదులో వాడాలో వివరించారు. వర్షాలు కురుస్తుంటే మందులు పిచికారి చేయరాదని సూచించారు. పంటపొలాల్లో నుంచి మురుగు నీటినితొలగించాలని సూచించారు. కాగా ఈ సంవత్సరం పత్తిపంట బాగుందని రైతులు సంతోషిస్తుండగా ఇటీవల భారీ వర్షాల వల్ల వేర్లు కుళ్లి ఎరుపు బారుతుందని, చేతికి వచ్చిన పెసర, మినుము పంటలు మొలకెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదులో జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలి

● బీజేపీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య


సంగారెడ్డిలో సభ్యత్వ నమోదు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9: సభ్యత్వ నమోదులో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్వాపురం లక్ష్మీనర్సయ్య సూచించారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బస్వాపురం లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రతీ బూత్‌లో 200 మెంబర్‌షిప్ తగ్గకుండా చేయాలని సూచించారు. నియోజకవర్గానికి లక్ష మెంబర్‌షిప్ తప్పనిసరి చేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు ఇచ్చిన సభ్యత్వ నమోదు టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు ప్రతీ కార్యకర్త కష్టపడి సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేయించడంలో ప్రతీ కార్యకర్త ముందుండాలని, 8800002024 నంబరు ద్వారా మిస్ కాల్ ఇచ్చి సభ్యత్వం పొందాలని ఆమె సూచించారు. అనంతరం పట్టణంలోని రెవిన్యూ కాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలించి బాధితులకు తాగునీటి డబ్బాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు అంజిరెడ్డి, రవీందర్, ఎడ్ల రమేశ్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం


చిలప్‌చెడ్: శేరికుంట తండాలో తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోషిమాత

వట్‌పల్లి, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు సంగీత, రాజేశ్వరి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ శాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

● చిలప్‌చెడ్: పిల్లల తల్లులు రక్త హీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని శేరికుంట తండాలో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత మాట్లాడుతూ.. సెప్టెంబరు 1 నుంచి 30 వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొదటి వారంలో ప్రతీ అంగన్‌వాడి కేంద్రంలో గ్రోత్ మానిటరింగ్ మరియు వీహెచ్ఎస్ఎన్‌డీ కార్యక్రమాలు నిర్వహించారని, రెండవ వారంలో 'పోషన్ బీ- పడాయి బీ', ఎనిమియా గురించి వివరించడం లాంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు ప్రైమరీ స్కూల్ టీచర్ శ్రీలత, అంగన్‌వాడి టీచర్ స్వరూప తల్లులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీలో ఇళ్ల మధ్య నీరు

నర్సాపూర్, సెప్టెంబరు 9: నర్సాపూర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో వర్షం నీటితో పాటు మురికినీరు ఇళ్ల మధ్యన చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ పరిధిలోని కోమటికుంట కింది భాగంలో కొత్తగా ఏర్పాటు అయిన వెంకటేశ్వరకాలనీలో మురుగు కాల్వలు లేకపోవడంతో ఇటీవల భారీ వర్షాలకు వరదనీటితో పాటు మురుగునీరు నివాసాల మధ్యన చేరి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో సోమవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఇరిగేషన్ ఏఈ మణిభూషన్ కాలనీకి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ కోమటికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పూర్తి విచారణ చేసి ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేశారు.


రైల్వేగేట్ వద్ద ప్రమాదకరంగా గుంత

కోహీర్ మండల కేంద్రంలోని 24వ రైల్వేగేట్ వద్ద గుంత వాహనదారులకు శాపంగా పరిణమించింది. ఇటీవల భారీ వర్షాలకు గుంతలో నీరు చేరాయి. ద్విచక్రవాహనదారులు నీటిలో నుంచి వెళ్లే క్రమంలో గుంత ఎక్కడుందో తెలియక వాహనాలు అదుపు తప్పి గాయాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు జరిపించాలని స్థానికులుకోరుతున్నారు.

- కోహీర్, సెప్టెంబరు 9

మనూరులో కొనుగోలు కేంద్రం ప్రారంభం


పెసర్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, సెప్టెంబరు 9: మండలకేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి పెసర్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాఫెడ్‌వారిచే మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర అందించాలనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. క్వింటాల్‌కు రూ.8,682 ధరతో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్‌కుమార్, ఏవో మహేష్ చౌహాన్, ఏఈవో సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ అధికారులు స్వప్న, శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకర భారతి మహారాజ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

మహారాష్ట్రలోని నగర్‌కు చెందిన శంకర భారతి మహారాజ్ సోమవారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహానికి విచ్చేయగా ఎమ్మెల్యే ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరులు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఖేడ్ మండలం కిషన్‌నాయక్ తండాకు చెందిన రత్నాబాయికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు కాగా, అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు.


నైపుణ్యం ఉంటే మరిన్ని ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న శిక్షకుడు రమేష్

జహీరాబాద్, సెప్టెంబరు 9: నైపుణ్యం కలిగిన విద్యార్థులకు అన్ని రంగాల్లో భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని ట్రైనర్(శిక్షకుడు) రమేష్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్‌లోని ఆచార్యడిగ్రీకళాశాలలో విద్యార్థులకు టాస్క్‌శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మల్టీనేషన్ కంపనీల్లో నైపుణ్యం ఉన్నవారికే ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు రెజ్యూమ్ ప్రిపరేషన్, టైం మేనేజ్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ స్కిల్స్ ప్రొఫెషనల్ స్కిల్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆచార్యడిగ్రీకళాశాలలో ప్రముఖకవి కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మరికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదిరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు


మహేష్‌కుమార్‌గౌడ్‌కు బొకేను అందజేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్, సెప్టెంబరు 9: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నూతన రథసారథిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను జహీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: మండలానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగానరేందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: చింతా ప్రభాకర్



సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదన్నారు. అడ్డదారుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకోవాలనుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా స్పీకర్ కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అసలు రంగు ఏంటో తొమ్మిది నెలల కాలంలోనే బయటపడిందన్నారు. అనర్హత వేటు పడనున్న అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు జరిగితే, ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, బీవీ శ్రీనివాస్, జలందర్‌రావు పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమాధికారుల జిల్లా ఫోరం ఎన్నిక


వసతిగృహ సంక్షేమాధికారుల ఫోరం జిల్లా నూతన కార్యవర్గం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9: వసతి గృహ సంక్షేమాధికారుల సంగారెడ్డి జిల్లా ఫోరం ఎన్నికలు సోమవారం సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో జరిగాయి. వసతి గృహ సంక్షేమాధికారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. గౌస్‌మొయినుద్దీన్ అధ్యక్షతన, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, కార్యదర్శి రవిల సమక్షంలో జిల్లా ఫోరం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా బద్రిప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా శంకరయ్య, నాగేశ్వరరావు, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా నర్సింహులు, శివకుమార్, రవీందర్, రాధిక, జాయింట్ సెక్రటరీగా దుర్గేష్, శోభారాణి, రామప్ప, వెంకటలక్ష్మీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంతోష్, పబ్లిసిటీ సెక్రటరీగా వెంకటేశం, స్పోర్ట్స్ సెక్రటరీగా మానయ్య, కార్యవర్గసభ్యులుగా రాజిరెడ్డి, సువర్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో అసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, వెంకటరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, వివిధ సంక్షేమ శాఖల వసతిగృహ సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ఆదరణ కరువు

పుల్‌కల్, సెప్టెంబరు 9: మండలంలో ప్రజావాణి కార్యక్రమానికి ఆదరణ కరువైంది. ధరణితో పాటుగా పట్టదారు పాసుపుస్తకాల్లో భూమి తక్కువగా రావడం, మిస్సింగ్, వర్షాలకు పూరిళ్లు కూలిపోయాయంటూ పలువురు బాధితులు చౌటకూర్ తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. సోమవారం నాటి ప్రజావాణికి మూడు దరఖాస్తులు మాత్రమే అందాయని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ తెలిపారు.

ఓపెన్ సొసైటీ స్కూల్ ను సద్వినియోగం చేసుకోవాలి

మనోహరాబాద్, సెప్టెంబరు 9: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పోస్టర్‌ను జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఉమాదేవి ఆధ్వర్యంలో కాళ్లకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ఎలాంటి విద్యార్హతలు లేకున్నా పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదవొచ్చని తెలిపారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. దరఖాస్తులకు ఆఖరు గడువు సెప్టెంబరు 30 వరకు ఉందని తెలిపారు. దరఖాస్తు దారులు కాళ్లకల్ జడ్పీహెచ్ఎస్‌లో అసిస్టెంట్ కోర్డినేటర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఆడిట్ రికార్డులను పరిశీలించిన జడ్పీసీఈవో

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 9: మండలంలోని ఎంపీపీ కార్యాలయంలోని మెదక్ జడ్పీసీఈవో ఎల్లయ్య ఆడిట్ రికార్డులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల రికార్డులపై ఎంపీడీవో దామోదర్‌ను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో కలిసి రికార్డులను పరిశీలించి బిల్లుల చెల్లింపుపై ఆరా తీశారు.

చౌటకూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

పుల్‌కల్, సెప్టెంబరు 9: కొత్త మండలంగా ఏర్పాటైన చౌటకూర్‌లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు సోమవారం తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. మండలంగా ఏర్పాటై సుమారు నాలుగేళ్లు గడిచినప్పటికీ, తహసీల్దారు కార్యాలయం మినహా ఏ ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.